PRABHATA SURYA

# ప్రభాత సూర్య

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వేల రూ.5/ - పేజీలు : 8 సోమవారం 14 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 67

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## సింగరేణి నిధులు ఈ ప్రాంతంలోనే ఖర్చు పెట్టేలా చట్టం తీసుకువస్తాం

**మందమర్రి:** సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కోసం కేటాయించే డీఎంఎఫ్టీ నిధులు ఈ ప్రాంతంలోనే ఖర్చు చేసేలా త్వరలో చట్టం తీసుకువస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆయన బురదగూడెం, సుభాష్ నగర్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సింగరేణిలో నూతన గనుల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రితో మాట్లాడినట్లు చెప్పారు. గడిచిన ఏడాది సింగరేణి సంస్థ రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించిందని పేర్కొన్నారు.


విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news


# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం



- బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పుకునే ప్రయత్నంలో అధికార కాంగ్రెస్
- అసెంబ్లీలో బిల్లు మొదలు ఆర్డినెన్స్ వరకు రిజర్వేషన్ల అంశాన్ని ఉపయోగించుకునే వ్యూహం
- రాష్ట్రపతి వద్ద బిల్లు ఆమోదానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలేంటని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు
- అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు ఎందుకు తీసుకెళ్లలేదని నిలదీస్తున్న వైనం

**సూర్య న్యూస్ హైదరాబాద్**

రాష్ట్ర రాజకీయాలన్నీ బీసీ రిజర్వేషన్ల అంశం చుట్టూనే తిరుగుతున్నాయి. స్థానిక సంస్థలకు మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఊపందుకున్న రిజర్వేషన్ల రగడను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు అన్ని ప్రధాన పార్టీలు ఎత్తులు వేస్తున్నాయి. ఇందులో అధికార కాంగ్రెస్ ఓ అడుగు ముందుండగా.. బీఆర్ఎస్, బీజేపీ కూడా బీసీల మన్ననలు పొందేందుకు తమదైన శైలిలో ప్రయత్నిస్తున్నాయి. అయితే, పార్టీల వ్యూహ, ప్రతివ్యూహాలు ఎలా ఉన్నా.. ఈసారి స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలుకాకుండా ఎక్కడ - మిగతా2లో



## సారే జహాసె అచ్ఛా ఇండియా

- అంతరిక్ష కేంద్రం నుంచి శుభాంశు చివరి సందేశం
- నేడు ఐఎస్ఎస్ నుంచి బయలుదేరనున్న నలుగురు వ్యోమగాములు
- రేపు కాలిఫోర్నియా తీరంలో దిగనున్న స్పేస్ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్



## మినిమం బాదుడుకు బైబై!!

- 2024లో 11 పీఎస్‌బీలకు భారీ ఆదాయం
- రూ. 2,331 కోట్ల మినిమం బ్యాలెన్స్ పెనాల్టీ
- ఖాతాదారులకు ఇన్నాళ్లకు లభించిన ఊరట
- అకౌంట్లో కనీస బ్యాలెన్స్ పెనాల్టీ తొలగింపు
- లిస్టులో పీఎన్ బీ, బీవోబీ సహా 5 బ్యాంకులు





## రైల్లో సీసీటీవీలు

- పైలట్ ప్రాజెక్టు విజయవంతం
- దేశవ్యాప్తంగా అమలుకు నిర్ణయం
- 74 వేల బోగీలు, 15 వేల లోకోమోటివ్‌లలో కెమెరాలు
- ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ద్వారాల వద్ద ఏర్పాటు
- 100 కిలోమీటర్ల వేగంలోనూ స్పష్టమైన చిత్రాలు వచ్చేలా నాణ్యత

6

## వంతెనలు భద్రమేనా?!

- శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా..
- కుంగిన పిల్లర్లు.. కూలిన రక్షణ దిమ్మెలు
- ప్రతిపాదనలతోనే ఆర్ అండ్ బీ శాఖ కాలయాపన

2



## సాగర్ రెండో జోన్‌కు నేడు నీటి విడుదల

**హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి**

**పాలేరు వద్ద పనులు పరిశీలించిన మంత్రి పొంగులేటి**

**కూసుమంచి**

పాలేరు రిజర్వాయర్ నుంచి జిల్లాలోని సాగర్ ఆయకట్టు(రెండో జోన్‌కు) సోమవారం సాగునీటిని విడుదల చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలేరు వద్ద ఎడమ కాల్వకు చేపట్టిన యూటీ నిర్మాణ- మిగతా2లో





## స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలి

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సూచన
- నేడు నల్గొండ, రేపు సూర్యాపేట జిల్లాల్లో పర్యటన

వివరాలు 2లో..

# నేటి నుంచే కొత్త రేషన్‌కార్డులు

- సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- సాయంత్రం బహిరంగ సభలో ప్రసంగం



**సూర్య న్యూస్ హైదరాబాద్**

రాష్ట్రంలో సోమవారం నుంచే కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం కానుంది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం అక్కడే నిర్వహించనున్న బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఈ మేరకు సీఎం పర్యటన, సభ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రేషన్‌కార్డుల పంపిణీ, బహిరంగ సభ నేపథ్యంలో ఆదివారం సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ భేటీ అయి చర్చించారు. - మిగతా2లో

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై తెలంగాణ జాగృతి కార్యకర్తల దాడి



- క్యూ న్యూస్ కార్యాలయంలో ఫర్నిచర్, కిటికీలు ధ్వంసం
- మల్లన్న సహా పలువురికి స్వల్పగాయాలు
- పోలీసుల అదుపులో నలుగురు

**సూర్య న్యూస్ హైదరాబాద్**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు చెందిన క్యూ న్యూస్ కార్యాలయం వద్ద తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఆదివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ఇటీవల - మిగతా2లో

## కోట శ్రీనివాసరావుకు చివరి వీడ్కోలు

- మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు
- సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు



# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

ఆగిపోతాయేమోననే ఆందోళన బీసీ సంఘాలు, ఆయా వర్గాల ప్రజల్లో వ్యక్తమవుతోంది. మొత్తం మీద బీసీ రిజర్వేషన్ల అంశంలో రాజకీయ కౌంటర్లు, ఎన్‌కౌంటర్లు, కోర్టు కేసు వ్యవహారంపై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో అసలు ఎన్నికల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియకుండానే రాష్ట్రంలో 'స్థానిక'వేడి మొదలుకావడం గమనార్హం.

**అధికార పార్టీ ఏమనుకుంటోందంటే..**

ఎవరెంతో.. వారికంత అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అందిపుచ్చుకున్న దేశవ్యాప్త నినాదంతో సామాజిక న్యాయం చేస్తున్నామని చెప్పుకునేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఎస్సీల వర్గీకరణ, మంత్రివర్గ విస్తరణతోపాటు తాజాగా రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ఆర్డినెన్స్‌తో అన్ని వర్గాలకు తాము న్యాయం చేస్తున్నామని చెబుతోంది. అంతకంటే ముందు అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు కూడా కామారెడ్డి డిక్లరేషన్‌ను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామనేందుకు నిదర్శనమని ఆ పార్టీ నేతలంటున్నారు. తాము మాత్రమే బీసీలకు న్యాయం చేయగలమని, అందుకే చేశామని ఆ పార్టీ నేతలంటుండగా సీఎం రేవంత్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి రాహుల్‌గాంధీ ప్రధాని అయి ఉంటే 48 గంటల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించేవాడినన్నారు. కేబినెట్ ఆర్డినెన్స్ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు నిర్వహించి తామే బీసీల చాంపియన్‌నని చెబుతోంది. ఈ నేపథ్యంలోనే మరోమారు ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

అయితే, ఈ పార్టీ వర్గాల్లో బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఆగం చేస్తుందా అనే మీమాంస కూడా కనిపిస్తోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు రాష్ట్రపతి, పార్లమెంటు ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండగా, ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకురావడం ఏ మేరకు మేలు చేస్తుందనే దానిపై ఆ పార్టీ నేతల్లోనూ సందేహాలు వ్యక్తమవుతుండటం గమనార్హం.

**విపక్షాలు ఏమనుకుంటున్నాయంటే...**

కర్ర విరగకుండా పాము చావకుండా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, అధికారంలో ఉన్న పార్టీగా చేయాల్సింది చేయకుండా బీసీ వర్గాలను బుట్టలో వేసుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాష్ట్రం నుంచి అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందినప్పుడే చెప్పారని, అయితే ఇప్పటివరకు ఆ ప్రయత్నం ఎందుకు చేయలేదని నిలదీస్తున్నాయి.

అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తానని చెప్పిన తర్వాత ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి వచ్చిన ఆయన కనీసం ఒక్కసారి కూడా ఎందుకు బీసీ బిల్లు ఆమోదం గురించి వినతిపత్రం ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రపతి వద్దకు వెళ్లిన బిల్లును ఆమోదింపజేసి పార్లమెంటు ఆమోదం కోసం తీసుకురావడంలో కాంగ్రెస్ చేసిన కృషి ఏంటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌ను వినిపిస్తున్న బీఆర్ఎస్ ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది. బీసీలను మోసం చేసేందుకే ఆర్డినెన్స్ అంటున్నారని, ఏకసభ్య కమిషన్ పేరుతో ఇచ్చిన నివేదిక లొసుగులతో ఉందని, ఈ నేపథ్యంలో బీసీలకు న్యాయం జరిగే పరిస్థితి లేదని అంటోంది. ఇక, బీజేపీ కూడా ఈ విషయంలో కాంగ్రెస్ వైఖరిని తప్పుపడుతోంది.

రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా, ఆర్డినెన్స్ తేవడం బీసీలను ఏమార్చడానికేనని అంటోంది. తాము బహిరంగంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశానికి మద్దతిస్తున్నా.. అటు రాష్ట్రపతితోపాటు ఇటు పార్లమెంటులోనూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుకు ఆమోదం పొందకపోతే తమకు 'స్థానిక'ంగా పట్టురాదేమోననే ఆందోళన కమలనాథుల్లో వ్యక్తమవుతోంది.

**బీసీ సంఘాలు ఏమంటున్నాయి...**

ఆర్డినెన్స్ ఆధారంగా ప్రభుత్వం జారీ చేయాలనుకుంటున్న రిజర్వేషన్ల జీవోకు న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయన్న దానిపై బీసీ సంఘాల్లో, ఆయా వర్గాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ జీవో కోర్టులో నిలబడుతుందా లేదా అన్న దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కోర్టులో సవాల్ చేస్తే నిలబడదని కొందరు, కొన్ని ప్రాతిపదికల మీద నిలబడుతుందని మరికొందరు అంటున్నారు. గతంలో సుప్రీంకోర్టు చెప్పిన విధంగా రిజర్వేషన్ల సీలింగ్ 50 శాతానికి పరిమితం అవుతుందని, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన కల్పించే రిజర్వేషన్లు పోను 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు వర్తింపజేయడం సుప్రీంతీర్పు అమల్లో ఉన్నంతవరకు సాధ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే జీవోను సవాల్ చేస్తే వెంటనే కోర్టు కొట్టి వేస్తుందనేది వారి వాదన.

అయితే, గతంలో బీసీల జనాభా లెక్కలు అందుబాటులో లేనందున కోర్టులు కొట్టివేశాయని, ఇప్పుడు ప్రభుత్వం చేసిన కుల సర్వేలో బీసీల జనాభా 56 శాతంగా తేలిందని, బీసీలకు తగినంత రిజర్వేషన్లు కల్పించవచ్చని సుప్రీంకోర్టు తీర్పులోనే పేర్కొన్నందున 42 శాతం కోటా న్యాయ సమీక్షలో నిలబడుతుందని మరికొందరు వాదిస్తున్నారు. అలాగే, డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు అంశం కూడా ఈ వాదనకు బలాన్నిస్తుందని అంటున్నారు. మరోవైపు అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేసే క్రమంలోనే 50 శాతం సీలింగ్ చాలా రాష్ట్రాల్లో దాటిపోయిందని, తెలంగాణలోనూ ఇబ్బంది ఉండదని వారంటున్నారు. మరోవైపు బీసీ వర్గాలకు న్యాయం జరుగుతున్నందున దాన్ని అడ్డుకోవద్దని, కోర్టులో కేసులు వేయొద్దని అటు రాజకీయ పార్టీలకు, ఇటు ప్రజలకు బీసీ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నా ఏ క్షణంలో కోర్టులో కేసు పడుతుందోననే గుబులు మాత్రం కనిపిస్తోంది. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో ఇచ్చిన మరుసటి రోజే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున కోర్టు కూడా జోక్యం చేసుకోదనే వాదన సముచితం కాదనే భిన్నమైన అంశాన్ని బీసీ సంఘాల నిపుణులు తెరపైకి తెచ్చారు. గతంలో మహారాష్ట్రలో ఇదే జరిగిందని, మరాఠాలను బీసీల్లో చేర్చి, వారికి రిజర్వేషన్లు కల్పించి పంచాయతీ ఎన్నికలకు వెళ్తే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మరీ ఎన్నికల ప్రక్రియను నిలిపివేసిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో జీవోలు, ఆర్డినెన్స్‌ల కంటే పార్లమెంటు ఆమోదం ద్వారా 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడమే రక్షణ కవచమని, ఆ కోణంలోనే అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేయాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి.

# ఎడ్యుటెక్ కంపెనీల కట్టడి ఎలా?

హైదరాబాద్:

చట్ట విరుద్ధంగా కోచింగ్ కేంద్రాలను నిర్వహిస్తున్న సంస్థలను నియంత్రించటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. వీటిని దారికి తెచ్చేందుకు విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసు విభాగాల అధికారులతో ప్రత్యేక కమిటీ వేయాలని భావిస్తోంది. ఇంజనీరింగ్‌లో నైపుణ్యం పేరుతో కొన్ని సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఉన్నత విద్యా మండలి గుర్తించింది. డీమ్డ్, ప్రైవేటు యూనివర్సిటీల్లోకి స్కిల్ పేరుతో చొరబడుతున్న ఈ కంపెనీల వల్ల జరిగే నష్టాలను మండలి అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. స్కిల్ కోసం షార్ట్‌కట్స్‌లో ఇవి బోధిస్తున్నాయి. సబ్జెక్టు ఫ్యాకల్టీలో నాణ్యత పాటించడం లేదు. ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈ కోచింగ్ కేంద్రాలకు వెళ్లడం వల్ల నష్టం జరుగుతుందని ప్రభుత్వానికి మండలి తెలిపింది.

**ఏం చేస్తారో చేసుకోండి**

ఎలాంటి అనుమతులు లేకుండా కోచింగ్ కేంద్రాలు నడుపుతున్న సంస్థలకు గత నెలలో ఉన్నత విద్యా మండలి నోటీసులు ఇచ్చింది. అయితే, నోటీసులు పొందిన సంస్థలు మండలికి ఘాటుగా సమాధానం ఇచ్చాయి. తామెక్కడా చట్ట వి రుద్ధంగా బోధన చేయడం లేదని, విద్యార్థులు స్కిల్ కోసం తమ దగ్గరకు వస్తున్నారని పేర్కొన్నాయి. అసలు తమను నియంత్రించడం, నోటీసులు ఇచ్చే అధికారం ఉన్నత విద్యా మండలికి లేదని న్యాయవాదులతో సమాధానం ఇవ్వడంతో మండలి వర్గాలు నివ్వెరబోయాయి. ఇదే విషయాన్ని అధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. మరోవైపు ఆ సంస్థల్లో చేరిన విద్యార్థులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడించడం, మండలి అధికారులను తప్పుబడుతూ విద్యార్థులు మెయిల్స్ ఇవ్వడంతో సమస్య తీవ్రంగా మారింది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో చెప్పాలని మండలి అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. దీంతో సీఎం కార్యాలయం విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఇటీవల దీనిపై చర్చించింది.




**కట్టడి చేయకుంటే కష్టమే**

ఇంజనీరింగ్ పూర్తవ్వగానే ఉద్యోగం పొందడం ఒక్కటే లక్ష్యంగా భావిస్తున్న విద్యార్థుల బలహీనతను కోచింగ్ కేంద్రాలు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. ఇందులో డీమ్డ్, ప్రైవేటు యూనివర్సిటీలు ప్రధానంగా భాగస్వామ్యం అయ్యాయి. సబ్జెక్టులకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వకుండా, కేవలం ఉద్యోగం పొందేందుకు కొత్తగా వస్తున్న చాట్ జీపీటీ, ఏఐ సంబంధిత టెక్నాలజీపైనే షార్ట్ కట్స్ బోధిస్తున్నాయి. ఈ క్రమంలో కీలకమైన ఫ్యాకల్టీని కూడా తగ్గిస్తున్నాయి. హైదరాబాద్‌లోని రెండు డీమ్డ్ వర్సిటీలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న డీమ్డ్ వర్సిటీల ఆఫ్ క్యాంపస్‌లపై గత ఏడాది కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులొచ్చాయి. ఎమర్జింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు కాలేజీల్లో కాకుండా, స్కిల్ కేంద్రాల్లో బోధిస్తున్నారు. పరీక్షలు నిర్వహించి, డిగ్రీలు ఇవ్వడం మాత్రం కాలేజీల్లోనే జరుగుతోంది. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని మండలి పేర్కొంది. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో బేసిక్స్ నేర్పుతారు. రెండు, మూడు సంవత్సరాల్లో కీలకమైన కోడింగ్‌పై సబ్జెక్టులు ఉంటాయి. ఇదే క్రమంలో ఎమర్జింగ్ కోర్సులకు పారిశ్రామిక భాగస్వామ్యంతో శిక్షణ ఇవ్వాలి. అప్పుడే విద్యార్థి కోడింగ్‌పై పట్టు సాధిస్తాడు. ఏఐ చేసే కోడింగ్, డీ%-%కోడింగ్ కచ్చితమైనదేనా? కాదా? అనేది సబ్జెక్టులపై అవగాహన ఉన్నప్పుడే తెలుస్తుంది. ప్రైవేటు కాలేజీలు దీన్ని విస్మరించి ఉద్యోగం పొందడానికి అవసరమైన స్కిల్స్‌ను మాత్రమే నేర్పుతుండటంతో ఉద్యోగం వచ్చినా, పనిలో పురోగతి సాధించలేకపోతున్నారు. గడచిన ఐదేళ్లలో ఐటీ కంపెనీల్లో అనేక మంది కోడింగ్‌పై పట్టు లేకపోవడం వల్లే ఉద్యోగాలు పోగొట్టుకున్నారు.

# కోట శ్రీనివాసరావుకు చివరి వీడ్కోలు

టాలీవుడ్ ఇండస్ట్రీలోనే ఈరోజు ఒక చీకటి రోజు అని చెప్పుకోవచ్చు. ఒక అద్భుత నటుడు ఈ లోకం నుంచి దూరమయ్యారు. విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు నేటి ఉదయం మరణించిన విషయం తెలిసిందే. గత కొంతకాలంగా వయో వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన నేడు తుదిశ్వాస విడిచారు. దీంతో టాలీవుడ్ లో తీవ్ర విషాదం నెలకొంది. సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. లెజెండరీ నటుడు కోట శ్రీనివాసరావుకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన టాలీవుడ్.. కోట అంతిమయాత్రకు తరలివచ్చింది. సినీతారలు, అభిమానుల అశ్రునయనాల మధ్య కోట అంత్యక్రియలు ముగిశాయి. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి.. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం వరకు చివరియాత్ర కొనసాగింది. కుటుంబసభ్యుల సమక్షంలో పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కాగా.. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట శ్రీనివాసరావు ఇవాళ ఉదయం తెల్లవారుజామును కన్నుమూశారు. విలక్షణ నటుడి మరణ వార్త విన్న టాలీవుడ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. కోట మరణం పట్ల మెగాస్టార్ చిరంజీవి, తనికెళ్ల భరణి, బాబు మోహన్, బ్రహ్మానందం సంతాపం వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసంలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో కోట అంతిమ సంస్కారాలు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. కోట ఇక తిరిగిరారు అన్న విషయాన్నీ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. వీడ్కోలు.. నేస్తమా అంటూ కోటకు నివాళులు అర్పిస్తున్నారు.

## వంతెనలు భద్రమేనా?!

హైదరాబాద్

రాష్ట్రంలో నదులు, ప్రధాన వాగులపై ఉన్న వంతెనలకు నిర్వహణ కరవైంది. పలుచోట్ల ప్రమాదకరంగా మారాయి. రోడ్లు-భవనాల శాఖ పరిధిలోని వీటిని ఎక్కడా పట్టించుకోవడం లేదు. ఐదు రోజుల కిందట గుజరాత్‌లోని వడోదరాలో వంతెన కుప్పకూలడంతో వాహనాలు నదిలో పడిపోయి పలువురు ప్రాణాలు కోల్పోయారు. గత నెలలో మహారాష్ట్రలోని పుణెలో ఇంద్రాయణి నదిపై ఓ వంతెన కుప్పకూలి పలువురు పర్యాటకులు నదిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. ఈ రెండు వంతెనలు నిర్మించి సుమారు 30 ఏళ్లు కావడం, వర్షాలకు తడిసి దెబ్బతినడంతో కూలినట్లు ప్రాథమిక అంచనాల్లో తెలుస్తోంది. తెలంగాణలోని పలు వంతెనలను నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నాయి. అప్పటి వాహనాల రద్దీకి అనుగుణంగా వాటిని నిర్మించారు. ప్రస్తుతం ట్రాఫిక్ మూడు, నాలుగు రెట్లు పెరగడంతో పాటు వంతెనలు సైతం శిథిలావస్థకు చేరడంతో భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. వనపర్తి జిల్లా కేంద్రం నుంచి ఆత్మకూరు వెళ్లే దారిలో కొత్తపల్లి వద్ద ఊకచెట్టి వాగుపై వంతెన రక్షణ దిమ్మెలు కూలి ఇనుప చువ్వలు పైకి తేలాయి. సుమారు 200 మీటర్లున్న ఈ వంతెనకు 11 పిల్లర్లు ఉండగా... ఆరో పిల్లర్ కుంగింది. ఆ ప్రాంతంలో వరద చేరినప్పుడల్లా పిల్లర్ నీటిలో మునిగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. రక్షణ దిమ్మెలకు, పిల్లర్ల మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు వద్ద పెద్దవాగుపై నిర్మించిన వంతెన పొడవు 280 మీటర్లు. 11 పిల్లర్లు ఉన్నాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్‌ల నుంచి మహారాష్ట్రకు వెళ్లడానికి ఈ వంతెనే ఆధారం. ఈ వంతెనపై పలుచోట్ల పగుళ్లు పట్టి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. బ్రిడ్జి మధ్య ఉండాల్సిన రాడ్ల మధ్య దూరం పెరిగి ప్రమాదకరంగా మారాయి. వంతెనకు మరమ్మతులు అవసరమని స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపినా కాగితాలకే పరిమితమయ్యాయి.

**కానరాని నిర్వహణ...**

రాష్ట్రంలో పెద్దవాగులపై నిర్మించిన పలు వంతెనలు శిథిలావస్థకు చేరాయి. రక్షణ దిమ్మెలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల దిమ్మెలు కూలి వాగులో పడిపోయాయి. ఇనుప చువ్వలు పైకి తేలాయి. వంతెనలు ప్రమాదకరంగా మారాయని, మరమ్మతులు చేపట్టాలంటూ స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా కార్యరూపం దాల్చడం లేదు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై తెలంగాణ జాగృతి కార్యకర్తల దాడి

-మొదటిపేజీ తరువాయి

జహీరాబాద్‌లో నిర్వహించిన బీసీ నేతల సమావేశంలో తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ జాగృతి కార్యకర్తలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలోని క్యూ న్యూస్ కార్యాలయం పైకి వచ్చారు. సిబ్బందిని తోసివేసి ఫర్నిచర్, కిటికీలు ధ్వంసం చేశారు. ఈ సమయంలో మల్లన్న తన ఛాంబర్లోనే ఉండగా.. తలుపులు పగులగొట్టి లోపలికెళ్లి దాడి చేశారు. ఈ క్రమంలో ఆయన కుడిచేతికి స్వల్ప గాయమైంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గన్‌మేన్ శ్రీనివాస్ తన తుపాకీతో ఆరు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. విషయం తెలుసుకొని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ ఆర్.గోవిందరెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే ఆందోళనకారులు కొందరు పరారయ్యారు. జాగృతి కార్యకర్త సాయి చేతికి అద్దం గుచ్చుకుని గాయమవగా ఆసుపత్రికి తీసుకెళ్లారు. జాగృతి యాదాద్రి జిల్లా అధ్యక్షుడు సందుపట్ల సుజిత్‌రావు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్‌తోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మల్లన్నకు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. 'నాపై దాడి చేయడమే కాకుండా.. నా గన్‌మేన్ చేతిలోని తుపాకీ లాక్కొని నన్ను కాల్చేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన మరో గన్‌మేన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఎమ్మెల్సీ కవిత తన ఉనికి కోసం బీసీ నాయకత్వం మీద దాడి చేస్తే ఊరుకోం' అని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కవిత, మల్లన్నలపై కేసులు నమోదైనట్లు మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

**మల్లన్న ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలి**

తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. మల్లన్నపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ డీజీపీ కార్యాలయంలో అదనపు ఐజీ(శాంతిభద్రతలు) రమణకుమార్‌కూ ఫిర్యాదు చేశారు. 'ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆయనే మల్లన్నతో మాట్లాడించారని భావించాల్సి ఉంటుంది' అని ఈ సందర్భంగా కవిత పేర్కొన్నారు.

## నేటి నుంచే కొత్త రేషన్‌కార్డులు

-మొదటిపేజీ తరువాయి

కాగా, సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుమలగిరిలోని సభా ప్రాంగణానికి చేరుకుంటారు. తొలుత కొత్త రేషన్‌కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సభలో ప్రసంగిస్తారు. తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ సభకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. 11 చోట్ల పార్కింగ్‌ను సిద్ధం చేశారు. ఈ సభ కోసం కాంగ్రెస్ నేతలు భారీగా జన సమీకరణ చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలుతోపాటు మం త్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులను తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిసింది. రేవంత్ సీఎం హోదాలో తొలిసారి సూర్యాపేట జిల్లాకు, తుంగతుర్తి నియోజకవర్గానికి వస్తుండటంతో ఆ ప్రాంతానికి ప్రత్యేకంగా నిధులు, వరాలు ఏమైనా ఇస్తారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తుంగతుర్తిలో జూనియర్ కళాశాలకు భవన నిర్మాణం, వెలుగుపల్లి రుద్రమ్మ చెరువు రిజర్వాయర్‌గా మార్పు, కాల్వలు నిర్మించి దేవాదుల నీటి సరఫరా, డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్, బస్‌డిపో, 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు

## స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలి

రాంనగర్/హైదరాబాద్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సూచించారు. బీజేపీ సిద్ధాంతాలు, మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఆదివారం బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాంచందర్‌రావును ఆయన నివాసంలో శాలువాకప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. కాగా, ఆయన సోమవారం నుంచి రెండు రోజులపాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు నల్గొండలో వివిధ సంఘాలు, న్యాయవాదులు, వైద్యులతో, అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. మధ్యా హ్నం 3.30 గంటలకు సూర్యాపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అక్కడ పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. రాత్రికి ఆయన స్వగ్రామం కోదాడ నియోజకవర్గంలోని నల్లబండగూడెంలో బస చేస్తారు. మంగళవారం అక్కడ రైతులతో సమావేశమవుతారు. ఉదయం 10 గంటలకు కోదాడలో రైతులతో, మధ్యాహ్నం 1.30గంటలకు చౌటుప్పల్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించే సమావేశాల్లో పాల్గొంటారు.

# రైళ్లలో సీసీటీవీలు

న్యూఢిల్లీ

రైళ్లలో త్వరలో సీసీటీవీ కెమెరాలు దర్శనమివ్వనున్నాయి. భారతీయ రైల్వేస్ పరిధిలో ఉన్న మొత్తం 74 వేల ప్యాసింజర్ బోగీలు, 15 వేల సరుకు రవాణా లోకోస్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్లు రైల్వేశాఖ ఆదివారం ప్రకటించింది. ఉత్తర రైల్వే విభాగంలో కొన్ని ప్రయాణికుల బోగీలు, లోకోల్లో ప్రయోగాత్మకంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల వల్ల సత్ఫలితాలు వచ్చాయని, త్వరలో అన్ని బోగీల్లో కెమెరాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. బోగీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆ శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్‌సింగ్ బిట్టు శనివారం రైల్వే శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పైలట్ ప్రాజెక్టులో వచ్చిన ఫలితాలను సమీక్షించి, అన్ని బోగీల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో రైల్వేశాఖ తెలిపింది.

**ప్రయాణికులకు భద్రత**

బోగీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ప్రయాుణికుల భద్రత మరింత పెరుగుతుందని రైల్వేశాఖ అధికారులు చెబుతున్నారు. 'సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ప్రయాణికుల భద్రత మరింత పెరుగుతుంది. బోగీల్లో దోపిడీలకు పాల్పడే దొంగలు, వ్యవస్థీకృత ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ప్రయాణికుల ప్రైవసీకి ఇబ్బంది కలగ కుండా సీసీ కెమెరాలను బోగీల ద్వారాల వద్దనే ఏర్పాటు చేస్తాం'అని తెలిపారు.

**ఒక్కో బోగీలో 4 కెమెరాలు**

ప్రయాణికుల రైళ్లలో ఒక్కో బోగీలో నాలుగు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. బోగీకి ఉండే రెండు





ద్వారాల్లో ఒక్కో ద్వారం వద్ద రెండు చొప్పున డోమ్ టైప్ అత్యాధునిక కెమెరాలు అమర్చుతారు. లోకోమోటివ్‌లలో 6 సీసీ కెమెరాలు ఉంటాయి. ముందు, వెనుక భాగాల్లో ఒక్కోటి, కార్‌కు రెండు వైపులు రెండు డోమ్ టైప్ కెమెరాలు ఉంటాయి. వీటికి అదనంగా రెండు డెస్క్ మౌంటెడ్ మైక్రోఫోన్ కెమెరాలు కూడా ఏర్పాటుచేస్తారు. ఈ సీసీ కెమెరాలన్నీ ఎస్‌టీక్యూసీ సర్టిఫికేషన్‌తో అత్యాధునిక ఫీచర్లతో ఉంటాయని రైల్వేశాఖ అధికారులు తెలిపారు. కెమెరాల నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని రైల్వే మంత్రి సూచించినట్లు చెప్పారు. రైలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నా, వెలుతురు సరిగా లేకపోయినా సీసీ కెమెరా ఫుటేజీ అత్యంత స్పష్టంగా ఉండేలా నాణ్యమైన కెమెరాల అమర్చాలని కోరినట్లు వెల్లడించారు. ఇండియా ఏఐ మిషన్ సహకారంతో సీసీ కెమెరాల డేటా సేకరణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించుకోవాలని అశ్వినీ వైష్ణవ్ సూచించినట్లు పేర్కొన్నారు

# సారే జహాసె అచ్ఛా ఇండియా

న్యూఢిల్లీ

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్‌ఎస్) సోమవారం వీడ్కోలు పలుకబోతున్నారు. ఐఎస్ఎస్‌కు చేరుకున్న మొట్టమొదటి ఇండియన్ అస్ట్రోనాట్‌గా చరిత్ర సృష్టించిన శుక్లా 18 రోజుల తన అంతరిక్ష యాత్ర ముగించుకొని సహచర వ్యోమగాములతో కలిసి భూమిపైకి తిరిగిరాబోతున్నారు. యాక్సియోమ్ మిషన్-4(ఏఎక్స్-4) ముగింపు దశకు చేరుకోవడంతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఆదివారం ప్రత్యేక వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శుభాంశు శుక్లా చివరి సందేశం ఇచ్చారు. "భారతదేశం ఈరోజు అంతరిక్షం నుంచి నిర్భయంగా, పూర్తి విశ్వాసంతో సగర్వంగా కనిపిస్తోంది. సారే జహాసె ఆచ్ఛా ఇండియా. ఇదొక అద్భుతమైన, నమ్మశక్యంకాని ప్రయాణం. ఐఎస్ఎస్‌లో అంతరిక్ష ప్రయోగాల్లో ఈరోజు నా వ్యక్తిగత అధ్యాయం ముగిసింది. కానీ, భారతీయ అంతరిక్ష సంస్థ ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. మనమంతా కలిసి పని చేస్తే అనుకున్నది సాధించగలం. భవిష్యత్తులో మరెన్నో ఘన విజయాల కోసం మనం ఐక్యంగా కృషి చేయాలి. పరస్పరం సహకరించుకోవాలి. ఈ ప్రయోగం సఫలం కావడానికి, నేను ఇక్కడికి చేరుకోవడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఐఎస్ఎస్‌లో నిష్ణాతులైన సహచర వ్యోమగాములతో కలిసి పనిచేయడం మర్చిపోలేని అనుభవం. వారు నా అంతరిక్ష యాత్రను అందమైన అనుభూతిగా మార్చారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి మన భూమిని వీక్షించడం ఎన్నో గొప్ప జ్ఞాపకాలను మిగిల్చింది.

భూమిని చూసిన ప్రతిసారీ మాయజాలాన్ని చూస్తున్నట్టే ఉంది. నాకు అన్ని విధాలా మద్దతుగా నిలిచిన ఇస్రో, నాసా సైంటిస్టులకు కృతజ్ఞతలు. ఇలాంటి అంతరిక్ష యాత్రలు కేవలం శాస్త్రీయ పరిశోధనలకే కాకుండా మన దేశాలకు, మానవాళి ప్రగతికి తోడ్పడతాయి" అని శుభాంశు శుక్లా ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. సహచర వ్యోమగాములు ఆయనను ఆలింగనం చేసుకున్నారు. శుభాంశు శుక్లాతోపాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలాండ్‌కు చెందిన



సావోజ్ ఉజ్‌నాన్‌స్కీ-విస్నీవ్‌స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కపు సైతం మాట్లాడారు. తమ అనుభవాలు పంచుకున్నారు.

ఏఎక్స్-4 మిషన్‌లో భాగంగా గత నెల 26న అమెరికాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి నలుగురు వ్యోమగాములు శుభాంశు శుక్లా, పెగ్గీ విట్సన్, సావోజ్ ఉజ్‌నాన్‌స్కీ-విస్నీవ్‌స్కీ, టిబోర్ కపు బయలుదేరిన సంగతి తెలిసిందే.

ఐఎస్ఎస్ నుంచి వీరు ఇప్పటిదాకా భూగోళాన్ని 250 సార్లు చుట్టేశారు. భూమి చుట్టూ 96,56,064 కిలోమీటర్లు ప్రయాణించారు.

అంతరిక్ష కేంద్రంలో 60 రకాల శాస్త్రీయ ప్రయోగాల్లో పాలుపంచుకున్నారు. అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించి కీలకమైన సమాచారం అందించారు.

స్పేస్ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఐఎస్ఎస్ నుంచి శు భాంశు శుక్లా, పెగ్గీ విట్సన్, సావోజ్ ఉజ్‌నాన్‌స్కీ%-%విస్నీవ్‌స్కీ, టిబోర్ కపు భూమిపైకి తిరిగిరాబోతున్నారు. వారి రిటర్న్ షెడ్యూల్‌ను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అధికారికంగా ధ్రువీకరించింది.

భారత అంతరిక్ష ప్రయోగాల్లో శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా, ఐఎస్ఎస్‌కు చేరుకున్న మొదటి భారతీయుడిగా ఆయన రికార్డుకెక్కారు. ఆయన ప్రయా ణం కొత్త తరం భారతీయ శాస్త్రవేత్తలకు, అంతరిక్ష ఔత్సాహికులకు స్ఫూర్తిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

**ఘనస్వాగతానికి ఏర్పాట్లు**

అంతరిక్ష యాత్ర పూర్తికావడంతో నలుగురు వ్యోమగాములు భారత కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 2.25 గంటలకు ఐఎస్ఎస్ నుంచి స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌకలోకి చేరుకుంటారు. ప్రి%-%ఫ్లైట్ తనిఖీలు నిర్వహిస్తారు. అమెరికాలోని కాలిఫోర్నియా సమీపంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పసిఫిక్ సముద్ర తీరంలో నలుగురు వ్యో మగాములు భూమిపై దిగే అవకాశం ఉంది. అమెరికాలో ఏడు రోజుల క్వారంటైన్ తర్వాత స్వదేశానికి చేరుకొనే శుభాంశు శుక్లాకు ఘన స్వాగతం పలకడానికి ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో స్వాగత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# కాంగ్రెస్ కీలక సమవేశానికి సోనియా పిలుపు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజిక్ గ్రూప్ సమావేశం ఈనెల 15న జరగనుంది. దీనికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అధ్యక్షత వహించనున్నారు. సోనియాగాంధీ తన నివాసమైన 10, జన్‌పథ్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు పాల్గొనున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈసారి అధికార, విపక్షా పార్టీల మధ్య వాడివేడిగా జరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్



చేపట్టడంపై తీవ్ర ఆందోళన చేస్తున్న విపక్షాలు ఈ అంశాన్ని ఉభయసభల్లోనూ ప్రస్తావించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తరువాత జరుగుతున్న తొలి సమావేశాలు కావడంతో ఈ అంశాలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని కాంగ్రెస్ భావిస్తోంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21న ప్రారంభమై ఆగస్టు 21తో ముగియనున్నాయి. తొలుత ఆగస్టు 12తో సమావేశాలు ముగుస్తాయని ప్రకటించినప్పటికీ ఆ తర్వాత మరో వారం రోజులు పొడిగించాలని ప్రభుత్వ నిర్ణయించింది. దీంతో లెజిస్లేటివ్ ఎజెండా ఎక్కువగానే ఉండచ్చని తెలుస్తోంది. ఆటమిక్ ఎనర్జీ రంగంలో ప్రైవేటురంగానికి మార్గం సుగమం చేసే కీలక చట్టాన్ని ఈ సమావేశాల్లో తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.

## మినిమం బాదుడుకు బైబై!!

మినిమం బ్యాలెన్స్ నిబంధన.. బ్యాంకు ఖాతా నుంచి ఆఖరు రూపాయి కూడా ఊడ్చేసినా ఖర్చులు తీరని సామాన్యులకు, వేతన జీవులకు కంగారెత్తిస్తుంది. చెప్పిన దానికన్నా ఖాతాలో ఏ కాస్త తక్కువైనా సరే బ్యాంకులు పెనాల్టీ చార్జీల కింద బాదేస్తుంటాయి. అప్పటికి కట్టలేకపోతే, ఆ తర్వాత ఖాతాలోకి డబ్బు క్రెడిట్ కావడమే తరువాయి.. లాగేస్తాయి. ప్రైవేట్ బ్యాంకులు సరే.. ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా దీన్ని అడ్డం పెట్టుకుని వందల వేల కోట్ల రూపాయలు రాబట్టాయి. దీనిమీద చాలాకాలంగా విమర్శలు వస్తున్నా, పెద్దగా పట్టించుకోలేదు. కానీ ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇప్పుడు మనసు, రూటు మార్చుకుంటున్నాయి. ఎస్‌బీఐ కోవలో మరో 5 బ్యాంకులు ఈ 'మినిమం' నిబంధనను ఎత్తివేసి, మ్యాగ్జిమం ఊరటనిచ్చాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్ బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ), ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ ఈ జాబితాలో ఉన్నాయి. ఒక్కో ఖాతాదారువారీగా చూస్తే పెనాల్టీలు నామమాత్రంగా వందల రూపాయల స్థాయిలోనే కనిపిస్తాయి. కానీ, కోట్ల మంది పరంగా చూస్తే వేల కోట్ల రూపాయలు బ్యాంకులు వసూలు చేశాయి. ఆర్థిక శాఖ గతేడాది ఇచ్చిన గణాంకాల ప్రకారం మూడేళ్ల వ్యవధిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇలా వసూలు చేసింది ఏకంగా రూ.5,614 కోట్లు. 2024 ఆర్థిక సంవత్సరంలో 11 పీఎస్‌యూ బ్యాంకులు (పీఎస్‌బీలు) రూ.2,331 కోట్లు మినిమం బ్యాలెన్స్ పెనాల్టీల కింద వసూలు చేశాయి. 2023లో వసూలు చేసిన రూ.1,855 కోట్లతో పోలిస్తే ఇది 25.6 శాతం అధికం! చాలా మటుకు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని అల్పాదాయ కస్టమర్లు ఏటా రూ.360%-%720 వరకు, పట్టణ ప్రాంతాల్లోని వారు ఏటా కనీసం రూ. వెయ్యి అయినా చెల్లించుకోవాల్సి వస్తోందని అంచనా.

**ఇంతకీ ఎందుకీ చార్జీలు?**

2000కు ముందు ఈ నిబంధనను పెద్దగా పట్టించుకోకపోయినా, ఆ తర్వాత పెద్ద ప్రైవేట్ బ్యాంకులు వచ్చినప్పట్నుంచి ఇవి సర్వసాధారణమైపోయాయి. అప్పట్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ చార్జీలను రద్దు చేసినప్పటికీ 2017లో మళ్లీ ప్రవేశపెట్టింది. దీంతో కోట్లాది ఖాతాదారుల మీద ప్రభావం పడి చర్చకు దారి తీసింది. దీంతో కాస్త తగ్గించి, ఆ తర్వాత 2020లో కోవిడ్ సమయంలో పూర్తిగా తొలగించింది. వాస్తవానికి కస్టమర్ల ఖాతాల (సేవింగ్స్ అయినా, కరెంట్ అయినా) నిర్వహణ కోసం బ్యాంకులకు కాస్తంత ఖర్చవుతుంది. అంటే ఏటీఎం విత్‌డ్రాయల్స్, కార్డుల నిర్వహణ, పాస్‌బుక్ ప్రింటింగ్, బ్రాంచ్ సర్వీసులు, ఆన్ లైన్/మొబైల్ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాలు మొదలైనవి కల్పించడానికి ఖర్చులవుతాయి. కస్టమర్లు కనీసం కొంతైనా బ్యాలెన్స్ ఉంచితే ఆ ఖర్చులను కవర్ చేసుకోవచ్చనేది బ్యాంకుల ఆలోచన. అదొక్కటే కాదు.. ' ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ ఉంటే బ్యాంకులు ఎక్కువ వడ్డీ ఇవ్వాల్సిన అవసరం లేకుండా తక్కువ ఖర్చుకే డిపాజిట్లను సమీకరించుకున్నట్లు అవుతుంది. అలా చౌకగా వచ్చిన మొత్తాన్ని అధిక వడ్డీ రేటుపై రుణాలివ్వొచ్చు లేదా పెట్టుబడులకు వాడుకోవచ్చు.

' పెనాల్టీలనేవి బ్యాంకులకు ఇతరత్రా ఆదాయ వనరులాగా కూడా ఉపయోగపడతాయి. ' బ్యాలెన్స్ లేని ఖాతాల వల్ల తమకు ఉపయోగం లేకపోయినా తప్పనిసరిగా కేవైసీ, ఆడిట్‌లాంటివన్నీ చేయాలి. కాబట్టి ఆ భారాన్ని తగ్గించుకునేందుకు పెనాల్టీలు విధిస్తే కస్టమర్లు ఖాతాను యాక్టివ్‌గా ఉంచుకోవడమో లేదా మూసివేయడమో చేస్తారు కాబట్టి భారం కాస్త తగ్గుతుంది. ' హై-వేల్యూ కస్టమర్లు, లో-వేల్యూ కస్టమర్లను గుర్తించేందుకు, ఖాతాదారులను బట్టి ప్రీమియం సర్వీసుల్లాంటివి ఆఫర్ చేసేందుకు ఇవి ఉపయోగపడతాయి.

**ఎందుకు తొలగిస్తున్నాయంటే?**

కరువు.. ఆపై అధిక మాసంలాగా అసలే చేతిలో డబ్బు లేకపోగా.. పెనాల్టీల భారం కూడా తోడు కావడమనేది సామాన్య ఖాతాదారులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. దీన్ని భరించే బదులు ఖాతానే వాడటం మానేస్తే పోతుందని వదిలేస్తున్నారు కూడా. దీన్ని పరిష్కరించుకోవడంతో పాటు, అందరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తేవడంపై ప్రభుత్వం మరింతగా దృష్టి పెడుతుండటంతో దానికి తగ్గట్లుగా ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే తీసుకున్న ఈ నిర్ణయంతో.. సాధారణంగా కనీస బ్యాలెన్సను పాటించడం కష్టంగా ఉండే విద్యార్థులు, రైతులు, మహిళలు, గ్రామీణ - పట్టణ ప్రాంతాల్లోని పేదలు మొదలైన వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. వ్యాపార వ్యూహాలు..: ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడంలో బ్యాంకుల వ్యాపా ర వ్యూహాలు కూడా ఉన్నాయి. పెనాల్టీల రూపంలో కోట్లు వసూలు చేస్తున్నప్పటికీ బ్యాంకుల కోణంలో చూస్తే వాటికి వచ్చే వడ్డీ ఆదాయంతో పోలిస్తే ఇలా వచ్చే ఆదాయం చాలా తక్కువే. దీనికి తోడు చెడ్డ పేరు ఒకటి. దీంతో ఆ కాస్త మొత్తాన్ని వదులుకున్నా, కస్టమర్ల నమ్మకాన్ని పొందవచ్చనేది ఒక ఆలోచన. మినిమం బ్యాలెన్స్ పెనాల్టీ భారం లేదు కాబట్టి ఖాతాదారులు ఎంతో కొంతైనా వేస్తూ, తీస్తూ ఉండటం వల్ల ఖాతాలు యాక్టివ్‌గా ఉంటాయి. అలాగే పాతబడిన ఖాతాలపై పెనాల్టీలు వేయొద్దన్న నియంత్రణ సంస్థ ఆదేశాలను కూడా పాటించినట్లవుతుంది. జీరో-బ్యాలెన్స్, డిజిటల్ ఖాతాల్లాంటివి అందిస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటున్న కొత్త తరం సంస్థలతో పోటీపడేందుకు వీలవుతుంది. ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.633.4 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.386.51 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.369.16 కోట్లు ఇలా పెనాల్టీల కింద వసూలు చేశాయి.

## సాగర్ రెండో జోన్‌కు నీటి విడుదల నేడు

-మొదటిపేజీ తరువాయి

పనులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి ఆదివారం రాత్రి పరిశీలించారు. సోమవారం ఉదయమే 1,300 క్యూసెక్కుల నీటి విడుదలకు ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ డీఈఈ మాధవిని ఆదేశించారు. కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు హాజరవుతానని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలకు పాలేరు వద్ద ఎడమ కాల్వ యూటీ కొట్టుకుపోయిందని, ఈ ప్రాంతాన్ని అప్పట్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారని గుర్తు చేశారు. సీఎం సూచనలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో.. రూ.14.20 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన యూటీ, కాలువ మరమ్మతులు చేపట్టామని వివరించారు. ఈ ఏడాది కృష్ణా బేసిన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో.. అనుకున్న సమయానికంటే ముందే రైతులకు సాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ఆర్పీఎఫ్ తొలి మహిళా సారథిగా సోనాలి మిశ్రా

**న్యూఢిల్లీ:** మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారు. భారత సైన్యంలోనూ ప్రవేశించి, తమ సత్తా చాటుతున్నారు. ఇప్పుడు సీనియర్ ఐపీఎస్ అధికారిణి సోనాలి మిశ్రా.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా నియమితు లయ్యారు. జూలై 31న పదవీ విరమణ చేయనున్న మనోజ్ యాదవ్ స్థానంలో ఆమె ఈ పదవిని చేపడుతున్నారు. సోనాలి మిశ్రాను ఈ పదవిలో నియమించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ అధికారికంగా ఆమోదం తెలిపింది. సిబ్బంది మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం 2026, అక్టోబర్ 31 వరకూ అంటే పదవీ విరమణ చేసే వరకు సోనాలి మిశ్రా ఈ పదవిలో కొనసాగనున్నారు. రైల్వే ఆస్తులను కాపాడటం, ప్రయాణికుల భద్రత తదితర విధులతో పాటు, వాటి బాధ్యతలను అధికారులకు అప్పగించే విషయంలో ఆర్పీఎఫ్‌కు సోనాలీ మిశ్రా తొలి మహిళా అధికారిగా విధులు నిర్వహించనున్నారు. సోనాలి మిశ్రా మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన 1993 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారిణి. ఆమె ప్రస్తుతం మధ్యప్రదేశ్ పోలీసు విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ (సెలక్షన్)గా పనిచేస్తున్నారు. కాగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)1957లో పార్లమెంటు చట్టం ప్రకారం ఏర్పాటయ్యింది. దీనికి 1985, సెప్టెంబర్ 20న యూనియన్ సాయుధ దళం హోదా ఇచ్చారు.

## సంపాదకీయం

# ప్రైవేట్ సంస్థలకే నిర్మాణ బాధ్యతలు

భారత్–ఇంగ్లాండ్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు ఆసక్తితో చూస్తుండగా ప్రముఖ సిమెంట్ కంపెనీ వాణిజ్య ప్రకటన ట్యాగ్‌లైన్ ఒకటి నన్ను విశేషంగా ఆకర్షించింది. అదిలా ఉంది: '. ఇది నూటికి నూరుపాళ్ల సత్యం. అవును, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ విస్తరణ మధ్య బలమైన సానుకూల సంబంధముంటుంది. రోడ్లు, వంతెనలు, రైల్వేలు, విమానాశ్రయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు మొదలైన వాటికి భవనాలు నిర్మించాలి. ఈ సామాజిక, సామూహిక సదుపాయాలను సమృద్ధిగా నిర్మించుకున్నప్పుడే ఆర్థిక వ్యవస్థ విస్తరణ సాధ్యమవుతుంది. ఈ మౌలిక సదుపాయాలను మనం సత్వరమే అభివృద్ధిపరచుకోవాలి. అయితే వాటిని ఎలా నిర్మించుకోవాలో మనం తెలుసుకుని తీరాలి. జవహర్‌లాల్ నెహ్రూ ఒక గొప్ప నిర్మాత. ఆయనను ద్వేషించేవారు చేస్తున్న విమర్శలు నయా పైసా విలువలేనివి. 1947లో మన దేశ జనాభా 34 కోట్లు. అక్షరాస్యత రేటు కేవలం 12 శాతం. తన 17 ఏళ్ల ప్రధానమంత్రిత్వ కాలంలో నెహ్రూ ఎన్నో పాఠశాలలు, కళాశాలలు నిర్మించారు. ఐఐటీలు, ఐఐఎమ్‌లు, ఉక్కు కర్మాగారాలు, ఐఓసీ, ఓఎన్‌జీసీ, ఎన్ఎల్‌సీ, హెచ్ఏఎల్, బీహెచ్ఈఎల్, ఇస్రో, భాక్రానంగల్, హీరాకుడ్, దామోదర్ వ్యాలీ, ఇంకా ఎన్నో సమున్నత సంస్థలు, బహుళార్థ సాధక ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలకు ఆయనే అంకురార్పణ చేశారు, నిర్మించి అభివృద్ధిపరిచారు. ఇదంతా జరిగింది స్వాతంత్ర్య తొలి సంవత్సరాలలోను, అదీనూ విద్యా వ్యాప్తి చాలా తక్కువగా ఉన్న, సాంకేతికతలు అందుబాటులో లేని, మానవ వనరులకు నైపుణ్యాలు కొరవడిన కాలంలో అన్న వాస్తవాన్ని విస్మరించకపోతే నెహ్రూ నిర్మాణ సామర్థ్యం ఎంత మహోన్నతమైనదో అర్థమవుతుంది. నెహ్రూ నిర్మించినవి ఈ నాటికీ ఉన్నాయి, జాతి పురోగతికి అద్వితీయంగా దోహదం చేస్తున్నాయి. నెహ్రూ భారత్‌కు ఆర్థిక వనరులు తక్కువగా ఉండవచ్చునేమో కానీ, చిత్తశుద్ధి, అంకిత స్వభావం, ప్రతిభాపాటవాలు ఉన్న మానవవనరులు సమృద్ధిగా ఉన్నాయి. క్రీస్తుశకం రెండవ శతాబ్దిలో చోళ చక్రవర్తి కావేరీ నదిపై గొప్ప ఆనకట్ట నిర్మించాడు. ప్రపంచంలో అత్యంత పురాతన ఆనకట్టలలో అదొకటి. నేటికీ ఉపయోగంలో ఉన్నది. వేలాది ఎకరాలకు సాగునీటి సదుపాయాన్ని కల్పిస్తున్నది. అంతకంటే ముఖ్యంగా వరదల నియంత్రణకు ఇతోధికంగా తోడ్పడుతోంది. భారత్ నేటికీ ప్రతి రోజూ ఈ మహా నిర్మాణ కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉన్నది. అయితే ప్రైవేట్ రంగంలో నిర్మాణాల, ప్రభుత్వ రంగంలో నిర్మాణాల నాణ్యత, మన్నిక మధ్య ఎంత వ్యత్యాసమున్నదో ప్రతి పౌరుడికీ బాగా తెలుసు. ఈ రెండు విధాల నిర్మాణ కార్యకలాపాలలోనూ కాంట్రాక్టర్లు పాల్గొంటున్నారు. అయితే వారు ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు వేర్వేరుగా ఉంటున్నాయి. నిర్మాణ ప్రక్రియలూ భిన్నమైనవి. ప్రజల ధనంతో ప్రభుత్వ రంగంలో జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాల తీరుతెన్నులను పరిశీలిద్దాం. ప్రైవేట్ నిర్మాణ కార్యకలాపాల నాణ్యత ఎంపిక చేసుకున్న ఆర్కిటెక్ట్, నియమించుకున్న కాంట్రాక్టర్, నిధుల లభ్యతపై ఆధారపడి భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ నిర్మాణ కార్యకలాపాలు, మరీ ముఖ్యంగా జాతీయ ప్రాధాన్యమున్న ప్రాజెక్టులకు భూమి, నిధుల పరంగా అవరోధాలు ఉండవు. అయితే మనం చూస్తున్నదేమిటి? హైవేలు, కొత్త రోడ్లు నిర్మాణమయి అవగానే కుంగిపోతున్నాయి. మురుగునీటిని తీసుకువెళ్లే కాలవలు లేదా గొట్టాలు పగిలిపోయి రోడ్లపై మురుగునీరు వెల్లువెత్తుతోంది. దేశ రాజధానిలోని అశోకా రోడ్డులో గత 18 నెలల్లో మురుగునీటి గొట్టాలు పగిలిపోవడం, రోడ్డు కుంగిపోవడం మూడుసార్లు సంభవించింది. రోడ్లు గుంతలమయమైపోతున్నాయి. ఆ బాటల్లో ప్రయాణిస్తున్న వాహనాలు ఆ గుంతల్లో పడిపోతున్నాయి. గ్వాలియర్‌లో రూ. 18 కోట్ల వ్యయంతో నిర్మాణమైన ఒక రోడ్డు 15 రోజులలోనే కుంగిపోయింది. గుజరాత్‌లోని మోర్బిలో మరమ్మతు నిర్వహించి వాహనాల రాకపోకలకు పునఃప్రారంభించిన ఒక వంతెన నాలుగు రోజులలోనే కూలిపోవడంతో 141 మంది మరణించారు. సరైన అర్హతలులేని కంపెనీకి ఆ వంతెన మరమ్మతు, పునరుద్ధరణ పనులను అప్పగించినట్టు విచారణలో వెల్లడయింది. సదరు కాంట్రాక్టర్ నాసిరకం సామగ్రిని ఉపయోగించడం వల్లే వంతెన కూలిపోవడం జరిగింది. బిహార్‌లో వంతెనలు నిర్మాణంలో ఉన్నప్పుడో లేదా నిర్మాణమైన వెంటనే కూలిపోతేనో ఆశ్చర్యపోయేవాళ్లు ఎవరూ ఉండరు సుమా! ఒక వంతెన అయితే నిర్మాణంలో ఉండగానే మూడుసార్లు కూలిపోయింది! ఎంత సమయం, మరెంత ధనం వృథా! ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. మొట్టమొదటి కారణం జవాబుదారీతనం పూర్తిగా లోపించడమే. ఒక వినాశనకర ప్రాజెక్టుకు పలువురు అధికారులు బాధ్యులయితే అంతిమంగా ఆ నష్టానికి ఏ ఒక్కరూ జవాబుదారీ కాదు అన్న రీతిలో పరిస్థితులు ఉన్నాయి. ఈ కారణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతారహితంగా వ్యవహరించడం సాధారణమైపోయింది. రాజకీయ అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? అపరిమిత ఆర్థిక లబ్ధిని సమకూర్చే మంత్రిత్వశాఖల విషయమై మంత్రుల మధ్య తీవ్ర పోటీ ఉంటోంది. చాలా రాష్ట్రాలలో 'రేట్ కార్డ్' ఉన్నది. ప్రాజెక్టులను అధ్వానంగా అమలుపరచడంలో కొన్ని విభాగాలు/ఏజెన్సీలు అప్రతిష్ఠను మూటకట్టుకుంటున్నాయి. ఈ విషయంలో పీడబ్ల్యూడీలు అగ్రగామిగా ఉన్నాయి. తక్కువ వ్యయ గృహ నిర్మాణాలు చేసే (ఇవి నిజానికి కాంక్రీట్ మురికివాడలు) డీడీఏ మొదలైన వాటి తీరుతెన్నులు కూడా ప్రశస్తంగా ఉండడం లేదు. హైవేస్, రైల్వేస్ పని తీరుకూడా ఇదే రీతిలో అధ్వానంగా ఉంటోంది. ప్రభుత్వ రంగంలో నిర్మాణ కార్యకలాపాలు సమర్థంగా, ప్రజోపయోగకరంగా లేకపోవడమనేది ఒక క్లిష్ట సమస్య. అపరిష్కృతంగా కొనసాగుతున్న ఒక చిక్కుముడి. సాహసోపేతంగా అసాధారణ చర్యలు చేపట్టినప్పుడే అది పరిష్కారమవుతుంది. ఇందుకు సామాజిక, సామూహిక సదుపాయల నిర్మాణంలో ప్రభుత్వ ఏజెన్సీల ప్రమేయాన్ని దశల వారీగా తొలగించాల్సి ఉన్నది. ఇటువంటి 'సంస్కరణల'కు గతంలో ప్రయత్నాలు జరిగాయి, విఫలమయ్యాయి. మరోసారి అటువంటి సంస్కరణలకు ప్రయత్నించినా మళ్లీ విఫలమవడం ఖాయం. మార్గాంతరమేమిటి? టెలికమ్యూనికేషన్స్, విద్యుత్ పంపిణీ, రవాణారంగం, మైనింగ్, చమురు, సహజవాయువు అన్వేషణ తదితర రంగాలలో ప్రైవేటీకరణ పరిస్థితులను మెరుగుపరిచింది. నాణ్యమైన సేవలను అందించేందుకు దోహదం చేసింది. ప్రభుత్వ రంగంలో నిర్మాణ కార్యకలాపాలలోనూ అదే బాటను అనుసరించడం ఉత్తమం. తొలుత వ్యయాలు పెరగవచ్చు, నిర్మాణ సంస్థలు ఒక కూటమిగా ఏర్పడడమూ జరగుతుంది, సందేహం లేదు. అయితే లొసుగులు, లోపాలు సరిదిద్దుతూ సామూహిక, సామాజిక సదుపాయాల నిర్మాణంలో ఆరోగ్యకరమైన పోటీతో ప్రైవేట్ సంస్థలకు మరింత పాత్ర కల్పించడమే అన్ని విధాల శ్రేయస్కరం.

# హిందీతో ఒరిగిందేంటి?




కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి భాషా తేనెతుట్టెను తట్టిలేపింది. బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర సర్కార్లను ముందుపెట్టి హిందీని బలవంతంగా రుద్దాలని చూసిన మోదీ సర్కారుకు భంగపాటు ఎదురైంది. 'నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020' ముసుగులో ప్రాథమిక విద్యలోనూ థర్డ్ లాంగ్వేజ్‌గా హిందీని తప్పనిసరిగా చేద్దామని చూసిన మహారాష్ట్ర బీజేపీ ప్రభుత్వంపై ఆ రాష్ట్రంలో నిరసనలు వ్యక్తమవుతుండటమే అందుకు నిదర్శనం. ఈ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఫడణవీస్ సర్కారు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. అయితే, 'ఆప్షనల్' పేరిట, అధ్యయన కమిటీ రూపేణా దొడ్డిదారిన హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నాలు కొనసాగుతుండటంతో మహారాష్ట్రలో భాషా వివాదం ఇంకా రగులుతూనే ఉన్నది. హిందీ భాషను బలవంతంగా రుద్దడంపై ఇప్పటికే పలు రాష్ట్రాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. మోదీ సర్కారు తీసుకొచ్చిన త్రీ లాంగ్వేజ్ పాలసీని తమిళనాడు సహా దేశంలోని అనేక రాష్ట్రాలు మొదటినుంచీ వ్యతిరేకిస్తున్నాయి. బలవంతంగా హిందీని రుద్దే ప్రయత్నంగా ఈ నిర్ణయాన్ని అన్ని వర్గాలు అభివర్ణిస్తున్నాయి. ఈ వివాదం ఇప్పుడు మహారాష్ట్రలో అగ్గిరాజేసింది. స్టేట్ బోర్డు ఆధ్వర్యంలో నడిచే మరాఠా, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో ప్రాథమిక విద్యలోనూ (గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5) హిందీని థర్డ్ లాంగ్వేజ్‌గా తప్పనిసరి చేస్తూ ఏప్రిల్ 16న మహారాష్ట్ర సర్కారు ఉత్తర్వులు జారీచేయడంతో మహారాష్ట్రలో భాషా కుంపటి రాజుకుంది. మరాఠా, ఇంగ్లీష్ మీడియం మినహా ఇతర మీడియం పాఠశాలల్లో ప్రాథమిక విద్యలో ఇప్పటికే థర్డ్ లాంగ్వేజ్ విధానం అమల్లో ఉండగా.. మరాఠా, ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో మాత్రం గ్రేడ్–5 నుంచి మాత్రమే థర్డ్ లాంగ్వేజ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. కనీస అధ్యయనం లేకుండా, చర్చలు చేయకుండా చిన్నారులపై హిందీని రుద్దడంపై ఆ రాష్ట్ర మేధావులు, భాషావేత్తలు, విద్యావేత్తలు, సాహితీవేత్తలు, ప్రాంతీయ భాషాభివృద్ధి సంస్థలు, రాజకీయ పార్టీల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ప్రాథమిక విద్యలో థర్డ్ లాంగ్వేజ్‌ను అమలు చేయడం, పైగా హిందీని రుద్దాలని చూడటాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది సాంస్కృతికంగా మరాఠా భాషను దెబ్బకొట్టడమేనని వారు మండిపడుతున్నారు. ఆరెస్సెస్ విధానం 'హిందీ, హిందూ, హిందుస్థాన్'లో భాగంగా మహారాష్ట్ర సర్కారు హిందీని తమ నెత్తిన రుద్దుతున్నదని పలువురు విమర్శించారు. చివరికి ప్రభుత్వం నియమించిన భాషా సలహా కమిటీ సైతం ఈ నిర్ణయాన్ని తప్పుబట్టింది. ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలో హిందీ తప్పనిసరి కాదని మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే ప్రకటించాల్సి వచ్చింది. అయితే, హిందీని జనరల్ థర్డ్ లాంగ్వేజ్‌గా పేర్కొంటూ జూన్ 17న మహారాష్ట్ర సర్కారు మరో ఉత్తర్వు జారీచేసింది. దేశంలోని ఏదైనా భాషను థర్డ్ లాంగ్వేజ్‌గా ఎంచుకోవచ్చని కానీ, కనీసం 20 మంది విద్యార్థుల నుంచి ఆ మేరకు డిమాండ్ రావాలని ఆ ఉత్తర్వులో పేర్కొనడంపై మహారాష్ట్రలో మరోసారి దుమారం చెలరేగింది. హిందీ వివాదం మహారాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులను తీసుకొచ్చింది. మరాఠాల ఆత్మగౌరవమే తమ పార్టీ సిద్ధాంతమని చెప్పుకొనే మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఈ విషయంపై తీవ్రంగా స్పందించింది. 'మనం హిందువులం, హిందీలం కాదు' అని ఆ పార్టీ అధ్యక్షుడు రాజ్ ఠాక్రే ఘాటుగా స్పందించారు. ఈ వివాదం ఠాక్రే సోదరుల కలయికకు మార్గం సుగమం చేసింది. రెండు దశాబ్దాల రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి రాజ్ ఠాక్రే, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఒకే వేదికను పంచుకున్నారు. 'హిందీ మాట్లాడే రాష్ట్రాలన్నీ మహారాష్ట్ర కంటే చాలా వెనుకబడి ఉన్నాయి. ఆ రాష్ట్రాల ప్రజలు హిందీ మాట్లాడని రాష్ట్రాలకు వలసపోతున్నారు. హిందీ వల్ల వారికేమైనా ఒరిగిందా? మరి మేం ఎందుకు హిందీ నేర్చుకోవాలి?' అని రాజ్ ఠాక్రే బీజేపీ పాలకులను ప్రశ్నించారు. 'ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్‌లో థర్డ్ లాంగ్వేజ్‌గా ఏ భాష ఉంది' అని ఉద్ధవ్ ఠాక్రే నిలదీశారు. మరోవైపు మహాయుతి కూటమిలోనూ 'హిందీ' రగడ మొదలైంది. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కూడా సొంత ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. గ్రేడ్–4 వరకు హిందీని అమలు చేయకూడదని ఆయన చెప్పడంతో ఫడణవీస్ సర్కారు కంగుతిన్నది. ఈ నేపథ్యంలో సవరించిన ఉత్తర్వులను కూడా వెనక్కి తీసుకుంటున్నట్టు ఫడణవీస్ ప్రకటించారు. త్రీ లాంగ్వేజ్ పాలసీపై అధ్యయనం చేసేందుకు ఆర్థికవేత్త నాగేంద్ర జాదవ్ నేతృత్వంలో ఓ కమిటీని నియమించగా, దానిపైనా విమర్శలు వెల్లువెత్తాయి. మొత్తానికి ఈ కమిటీతోపాటు త్రీ లాంగ్వేజ్ పాలసీని రద్దు చేయాలని మహారాష్ట్రలో డిమాండ్లు ఊపందుకున్నాయి. ఇంగ్లీష్ మాట్లాడేవారు సిగ్గుపడాల్సిన రోజు వస్తుందని ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే, భాషా వైవిధ్యమనేది భారత బలం. ఇలాంటి వివాదాలు రాజకీయ లబ్ధి కోసం పాలకులు తెరపైకి తీసుకొచ్చేవేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రజా సమస్యలను, తమ వైఫల్యాలను పక్కదారిపట్టించేందుకు వారు చేసే కుతంత్రాలివి. ఈ వివాదాలు తాత్కాలికంగా రాజకీయ ప్రయోజనం చేకూర్చవచ్చేమో గానీ, శాశ్వతంగా మాత్రం కాదు. హిందీని బలవంతంగా రుద్దడం వల్ల దేశానికి, కొలువుల కోసం కండ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్న యువతకు ఒనగూడే ప్రయోజనం ఏమీ లేదు. వాస్తవానికి ఇంగ్లీష్ మాట్లాడేందుకు దేశ యువత ఏ మాత్రం సిగ్గుపడటం లేదు. కొలువులు తీసుకొచ్చే భాషగా ఇంగ్లీష్‌ను యువత చూస్తున్నది. యువత కొలువులను కోరుకుంటున్నారే తప్ప, సమస్యలు కప్పిపుచ్చే ఇలాంటి భాషా వివాదాలను కాదు.

# మన వీధికి వచ్చిన నాటకం



సాంస్కృతిక దార్శనికుడు బాదల్ సర్కార్. నాటకం అంటే పుక్కిటి పురాణం కాదనీ, జనజీవన ప్రతిబింబమని నమ్మిన బాదల్ సర్కార్ భారతీయ రంగస్థలాన్ని విప్లవీకరించారు. అభివ్యక్తికి ఒక మౌలిక లక్ష్యం నిర్దేశించారు. అసమానతల గోడల్ని కూల్చడం కోసమే కళ అంటూ నినదించారు. ఉన్నత వర్గాల వారికి మాత్రమే పరిమితమైన రంగస్థలానికి స్వేచ్ఛను ప్రసాదించి, ప్రజా రంగస్థలంగా మలిచారు. కల్పిత కథలు, నిజ జీవితంతో సంబంధం లేని పాత్రలను కాలదన్ని పీడిత ప్రజలకు అండనిచ్చే హృద్యమైన మానవతా మంద్ర స్వరంగా నాటకాన్ని బాదల్ మార్చివేశారు. నాటక ప్రయోక్తగా ఎన్నో భిన్నమైన ప్రయోగాలు చేశారు. సగటు మనిషి ప్రసక్తి లేని పౌరాణిక నాటకాన్ని, కులీన వర్గానికి మాత్రమే నవీన నాటకం రెంటినీ అధిగమించి మొట్టమొదటిసారిగా సగటు మనిషి కోసం 'మూడో రంగస్థలం' (థర్డ్ థియేటర్)ను సృష్టించారు. అందుకే ప్రపంచ రంగస్థలం ఆయన్ని 'ఫాదర్ ఆఫ్ థర్డ్ థియేటర్'గా గౌరవిస్తోంది. జూలై 15, 1925న కలకత్తాలో సుధీంద్ర సర్కార్‌గా పుట్టిన బాదల్ ఇంజనీరింగ్ చదివారు. ఇంగ్లాండ్, నైజీరియా మొదలైన దేశాలలో ఉద్యోగాలు చేశారు. యాభై వరకు నాటకాలు రచించిన బాదల్ సర్కార్ భారతదేశంలో పీడిత ప్రజల పక్షాన ప్రత్యామ్నాయ రంగస్థలాన్ని లోతుగా అధ్యయనం చేసిన మొదటి వ్యక్తి. సంప్రదాయక నాటక రంగాన్ని కాదని సమిష్టి కృషితోనే కళ సంపూర్ణ వికాసం పొందుతుందని ఆయన నిరూపించారు. అందుకే, నాటక ప్రదర్శనకి ఆయన సరికొత్త నిర్వచనం ఇచ్చారు. ప్రదర్శనశాలలకు పరిమితమైన నాటకాన్ని ఏకంగా నాలుగు వీధుల కూడలిలోకి తీసుకువచ్చి మొదటిసారిగా 'వీధి నాటకాన్ని' నిర్మించారు. భారతీయ రంగస్థల చరిత్రలో అదో అసాధారణ విప్లవం. నాటకం అంటే గంటలకొద్దీ సాగే కథనం కాదని, అది ఒక నిరంతర చైతన్య ప్రవాహమని బాదల్ చాటారు. వీధి నాటకాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారు. ఆ ప్రక్రియలో నిత్య ప్రయోగశీలిగా నిలిచారు. ఈనాటికి కూడా స్ట్రీట్ ప్లే (వీధి నాటకం), అది ఏ ప్రాంతంలో, ఏ స్థాయిలో ప్రదర్శితమౌతున్నా దానికి ఆద్యుడు మాత్రం బాదల్ సర్కారే. బాదల్ సర్కార్ దృష్టిలో నాటకం అంటే జీవితాన్ని వినూత్నంగా దర్శింపజేసే విశిష్టమైన కళాత్మక సాధనం. అదేదో అలౌకికమైనది కాదు. సమాజంలో భాగం. జీవితానికి ప్రతిబింబం. సత్యాన్వేషణకి సోపానం. నాటక కళ నలుగుర్ని దగ్గరికి చేర్చాలి. వారి గుండె బరువు తీర్చాలి. అందుకే, అసలు వీధి నాటకం కళే కాదన్న వారికి దీటుగా జవాబిస్తూ, 'ప్రధాన స్రవంతి నాటకం ఆధిపత్య రూపమైతే, ప్రత్యామ్నాయ నాటకం మార్పుకు మాధ్యమం' అని బాదల్ నిరూపించారు. నక్సల్బరి ప్రభావితులయిన సగటు బెంగాల్ యువత సంక్లిష్ట మనస్తత్వాన్ని చిత్రించే అనేక విలువైన నాటక రచనలు బాదల్ చేశారు. 'అవర్ స్ట్రీట్ థియేటర్' (మన వీధి నాటకం) అన్న తన పుస్తకంలో పాలకుల నిర్బంధంలో వీధినాటకం, 'గెరిల్లా నాటకం'గా రూపాంతరం చెందుతుందని బాదల్ అన్నారు. ప్రశ్నను సహించలేని పాలక వర్గాలు, ధిక్కారాన్ని ఓర్చుకోలేని ప్రభుత్వాలు కళలను కట్టడి చేయడానికి, అణచివేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రజా నాటకం మరింత బలోపేతం కావాలని బాదల్ అన్నారు. నాటక కళా తాత్వికతను పునర్ నిర్వచించిన బాదల్, నాటకం అంటే కేవలం కల్పిత వినోద 'ప్రదర్శన' కాదని, అది వ్యవస్థలోని నిజాలను 'నిదర్శనం'గా చూపే శక్తిమంతమైన వాహకమని అన్నారు.

అందుకు అనుగుణంగానే చివరి వరకు ఆయన జీవితం సాగింది. దశాబ్దాల పాటు ప్రత్యామ్నాయ నాటక కళా ఉద్యమానికి నేతృత్వం వహించిన బాదల్ సర్కార్ ఎన్నడూ పాలకుల మెప్పు కోసం పాకులాడలేదు. మొదట్లో పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ పురస్కారాల్ని అంగీకరించినా తర్వాత కాలంలో చైతన్యం పెంపొంది ప్రభుత్వం ఇస్తానన్న పద్మభూషణ్ అవార్డును రెండుసార్లు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. 1967లో 'శతాబ్ది' అనే రంగస్థల సంస్థను స్థాపించిన బాదల్, ఈబాంగ్ ఇంద్రజిత్, బాసి ఖబర్, సారీ రాత్, పగల గోడా, స్పార్టకస్, బోమా వంటి అనేక వైవిధ్య నాటకాలు రచించారు. అతి తక్కువ ఖర్చుతో, తక్కువ మందితో ఎక్కడికక్కడ సొంతంగా ప్రదర్శించగలిగేది వీధి నాటకం. అందుకనే, పౌరసమాజంపై వెన్వెంటనే గాఢమైన ముద్రవేసే ఈ ప్రక్రియ త్వరలోనే ప్రజల్లోకి లోతుగా వెళ్ళిపోయింది. అనేక సాంస్కృతిక సంఘాలు వీధి నాటకాన్ని ఆయుధంగా ప్రయోగించడం పెరిగిపోయింది. 80వ దశకంలో కేరళలో ప్రారంభమై దేశ వ్యాప్తంగా కొనసాగిన వైజ్ఞానిక కళాజాతా మొదలుకుని జాతీయ స్థాయిలో జరిగిన మూఢనమ్మకాల వ్యతిరేక ఉద్యమం, తెలుగు రాష్ట్రాల్లో ఉవ్వెత్తున ఎగిసిన అక్షరాస్యత ఉద్యమం, మద్యపాన వ్యతిరేక ఉద్యమం తదితర ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న అసంఖ్యాక ప్రజలకు స్ఫూర్తి నింపిన వివిధ కళా రూపాలు, వీధి నాటకాలకు మూలం నాడు బాదల్ సర్కార్ రూపొందించిన రంగస్థల కార్యాచరణ ప్రభావితాలే. అదక్కడితో ఆగలేదు, అటు ఆదివాసి దళిత బహుజన సాంస్కృతిక సంస్థల నుండి, ఇటు ప్రగతిశీల మహిళా, గాంధేయవాద, సోషలిస్టు, వామపక్ష శక్తుల వరకు ప్రతి ప్రజాసంఘమూ వీధి నాటకాన్ని, భావజాల ప్రచార పనిముట్టుగా ఆశ్రయించాల్సి రావడం, బాదల్ సర్కార్ భావోద్యమాలలో సాధించిన అరుదైన విజయం. ప్రత్యామ్నాయ కళా రూపకంగా వీధి నాటకానికి మాత్రమే దక్కిన అపూర్వ గౌరవం. ప్రత్యామ్నాయ నాటకం ప్రజాచైతన్య పూరకం. మనిషి జీవితానికి సంబంధించిన ఉన్నత విలువలను ప్రమాణీకరించేది నాటకం. అది అనాదిగా అభివృద్ధి చెందుతున్న మానవాళి అభివ్యక్తికి ఆదర్శాత్మక చిహ్నం. కళాకారుడిగా, ప్రయోక్తగా, రచయితగా, సాంస్కృతిక కార్యకర్తగా, నిత్య చైతన్యశీలిగా బతికిన బాదల్ సర్కార్ 2011, మే 11న కేన్సర్‌తో చనిపోయారు. భారతీయ రంగస్థల చరిత్రలో మహత్తరమైన మార్పుకి సారథ్యం వహించిన ప్రజాపక్ష మేధావిగా బాదల్ సర్కార్ శాశ్వతంగా నిలిచిపోతారు. ఆయన దిశానిర్దేశం చేసిన ప్రత్యామ్నాయ రంగస్థలాన్నీ, అందులో ప్రధానమైన వీధి నాటకాన్ని మరింత బలోపేతం చేసుకుని సమసమాజ నిర్మాణం దిశగా సాగడమే బాదల్ సర్కార్ ఆశయ స్ఫూర్తికి మనం ఇవ్వాల్సిన బాధ్యతాయుతమైన నివాళి.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మకం

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజి ఎంపీపీ జవ్వాజి హరిష్



**రామడుగు, జూలై 13( ప్రభాత సూర్య ):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఈ నిర్ణయంతో బీసీలకు విరివిగా రాజకీయ అవాకాశాలు పెరుగుతాయని రాజకీయాలలో బీసీల దశ మారనుందని వ్యక్తం చేస్తు చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాజి ఎంపీపీ జవ్వాజి హరిష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు డా మేడిపల్లి సత్యం చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంపీణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమీటి చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి, దేశరాజుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కోల రమేష్, మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు, ఆల్గీ చైర్మన్ ఉప్పు అంజనీప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, జిల్లా ప్రదాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమీటి వైస్ చైర్మన్ పిండి సత్యం రెడ్డి, మాజీ ఎంపీపీ తడగొండ హన్మంతు, మాజి మార్కెట్ కమీటి చైర్మన్ కొమురయ్య, మాజీ ఎంపిటీసి మడ్డి శ్యామ్, మాజీ సర్పంచ్ కాడె శంకర్, మార్కెట్ కమీటి డైరక్టర్లు స్వామి, బాబు, ఎల్లయ్య, శేఖర్, లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పర్శారం, మైనర్టి సేల్ అధ్యక్షుడు ఆసిఫ్, క్రిష్ణ, కర్ణ శ్రీను, నర్సింగ్ బాబు, బాపిరాజు, నర్సింహ రెడ్డి, బువన్ గౌడ్,కటుకం మనీష్, పూసల వేణు, చొప్పదండి అనిల్, మీల్కి వర్ధన్ తదితరులు పాల్గోన్నారు.

# కాలుష్యాన్ని నియంత్రించకుంటే పరిశ్రమలను ముట్టడిస్తాం

**-సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**




**చౌటుప్పల్, జూలై 13, ప్రభాత సూర్య:**
చౌటుప్పల్ ప్రాంతంలోని పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యన్ని నియంత్రించకుంటే పరిశ్రమలను ముట్టడిస్తామని సిపిఐ నల్గొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హెచ్చరించారు. ఆదివారం చౌటుప్పల్ పట్టణంలోని బి ఆర్ కె కన్వెన్షన్ హాల్లో చౌటుప్పల్ మండల 7వ మహాసభను పిల్లి శంకర్, కడవేరి కౌసల్య ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిపిఐ జెండాను జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆవిష్కరించారు. అనంతరం మహాసభను ఉద్దేశించి సిపిఐ నల్గొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ... మార్క్సిజం, లేనినిజం సిద్ధాంతం పునాదులపైన దోపిడి వ్యవస్థను కూలదోసే చైతన్యవంతమైన కార్మిక, కర్షక ప్రజా పోరాటాలతోనే శ్రామిక రాజ్యం స్థాపన నిర్మిస్తామని అప్పుడే అసమానతలు లేని కొత్త సమాజంలో పేదల బతుకులు మారుతాయి అని అభిలాషించారు. కుల,మత,ధన,ప్రాంత ప్రాతిపదికన ప్రజల మధ్య వైరుధ్యాల సృష్టిస్తూ అడ్డదారుల్లో వక్ర పద్ధతుల్లో నేటి రాజకీయ వ్యవస్థ కొనసాగుతుందని ఇలాంటి నీచ రాజకీయాల దేశానికి ప్రజాస్వామానికి పెను ప్రమాదకరమని అన్నారు.రాజకీయాల్లోకి యువత విద్యార్థులు నిస్వార్థంగా సేవలందించేందుకు ముందుకు రావాలని అన్నారు.దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అమిత్ షా లు కమ్యూనిజాన్ని అంతం చేస్తామని విర్రవీగుతున్నారని కమ్యూనిజానికి అంతం లేదని అన్నారు. దోపిడి కొనసాగినంత కాలం కమ్యూనిజం అజారామంగా వెలుగొందుతూ ఉంటుందని అన్నారు. ఆపరేషన్ కగారు పేరుతో మావోయిస్టులను అంతం చేయడం సబబు కాదని, బూటకపు ఎన్కౌంటర్ లు అపాలని అన్నారు. ప్రభుత్వం మావోయిస్టుల భౌతిక కాయాలను కూడా ఇవ్వడానికి కూడా వణుకుతుందంటేనే కమ్యూనిజం బలం ఏందో తెలుస్తుందని అన్నారు. బూర్జువా భూస్వామ్య పెట్టుబడిదారీ రాజకీయాలలో రోజుకో పార్టీ మారుతూ పూటకో పార్టీ కండువా కప్పుకుంటూ అధికార పదవులకై వెంపర్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు ఏ పార్టీలో ఎందరున్నారో లెక్క తేల్దామా అని సవాల్ విసిరారు. సిపిఐ శ్రేణులు నిత్యం ప్రజలలో మమేకమవుతూ ప్రజా పోరాటాలను నిర్మించాలని, ప్రజా సంఘాలను విస్తరించాలని పిలుపునిచ్చారు. సిపిఐ 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా 2026 డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామని అన్నారు. అనంతరం సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు పెన్షన్లు మంజూరు చేయాలని, స్థానిక పరిశ్రమలో స్థానికులకే 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మల్కాపురం, కైతాపురం, దేవులమ్మ నాగారం,పీపల్ పహాడ్,తంగడపల్లి లక్కారం, చౌటుప్పల్ చెరువులను కృష్ణ జలాలతో నింపాలని అన్నారు.చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సర్వీస్ రోడ్డు వెంటనే పూర్తి చేయాలని, మండలానికి బస్ డిపో ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ హాస్పిటల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలను విస్మరిస్తే పాలకులకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.ప్రజా సమస్యల పరిష్కారానికై విరోచిత పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జని యాదగిరిరావు,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్,ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్,సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి,సిపిఐ జిల్లా సమితి సభ్యులు కలకొండ సంజీవ, నాయకులు ఉడుత రామలింగం,టంగుటూరి రాములు,బద్దుల సుధాకర్, కొండూరు వెంకటేష్,ఉడుత రామలింగం,దాసరి అంజయ్య, ఎస్ ఏ రెహ్మాన్, దాసరి యాదయ్య,కుంటి పాపయ్య, సింగపంగా బుచ్చయ్య, బోయిని యాదయ్య,రొండి నరసింహ, గడ్డం యాదయ్య,దాసరి కృష్ణ, గుండెబోయిన భాస్కర్, దాసరి మనోహర్,బద్దుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**-శ్రీకాంతా చారి తల్లి కాసోజు శంకరమ్మ**

**-ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి**

**-రాష్ట్ర కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించిన తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల సోమయ్య**



**ఖమ్మం( సూర్య ప్రతినిధి )**
తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీ యూజేఏసీ) రాష్ట్ర నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. హైద్రాబాద్ లోని అసెంబ్లీ ఎదుట ఉన్న అమర వీరుల స్థూపం వద్ద నూతన కమిటీతో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కమిటీకి గౌరవ సలహాదారులుగా తెలంగాణ సీనియర్ ఉద్యమ నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్ తొలి అమరుడు శ్రీకాంతా చారి తల్లి కసోజు శంకరమ్మ అన్వర్ పటేల్ లను సలహాదారులుగా నియమించారు. ఈ రాష్ట్ర కమిటీ ఛైర్మెన్ గా సుల్తాన్ యాదగిరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బత్తుల సోమయ్య మరొక ప్రధాన కార్యదర్శిగా సంగిశెట్టి క్రిస్టాఫర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా సయ్యద్ రసీద్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.రాజేంద్రప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ గా పాలకుర్తి కృష్ణ, కోయ వెంకట నారాయణ తునికిపాటి చారి అన్నిజిల్లాల నుంచి మరో పది మందిని ఎన్నుకున్నారు.మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా కోతి మాధవి రెడ్డి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా డోలక్ యాదగిరి ప్రధాన కార్యదర్శిగా షేక్ పక్రుద్దీన్ కార్యదర్శులుగా అంబాల రామారావు అంగిడి బిక్షం కొత్త వెంకట రెడ్డి ఉల్లంగి పద్మ షేక్ ఆఫ్జల్ ఉల్లోజు వెంకన్న రామాంజనేయులు జంపని అంజయ్య బొల్లికొండ పాపయ్య కుక్క సత్యం వడిత్యా రాజేష్ నాయక్ చెరుకూరి శ్రీలక్ష్మి కాలింగ్ గురువయ్య మందడి వెంకటేశ్వర్లు కుర్రి ముత్తయ్య తదితరులను రాష్ట్ర కమిటీకి తీసుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎందరో వీరులు బలయ్యారని వారి ప్రాణత్యాగాలు పాలకులకు కానరావడం లేదా అని అన్నారు. చేతికందిన బిడ్డలు ప్రాణాలు కోల్పోయి దిక్కులేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులకు పట్టెడు మెతుకులు దొరకడం లేదనీ సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టిన స్వతంత్ర సమరయోధులను సత్కరించుకున్న దేశం మనదని స్వరాష్ట్ర సాధన కోసం చేసిన ప్రాణ త్యాగాలు సరిపోవా..? అని సాధించుకున్న తెలంగాణలో కూడా ఇంకా ప్రాణ త్యాగాలు చేయాలా అని ప్రశ్నించారు.కత్తి మనవాడి చేతిలో ఉంటది కానీ ఆంధ్రా వాడు వచ్చి పొడిచిపోతాడు అన్న చందంగా మిగులు బడ్జెట్ ఉన్న మన రాష్ట్రాన్ని కేసీఆర్ ఆగం చేసిండని కాళేశ్వరం సంగతి కూడా అంతే జరిగిందని డబ్బు మనదైతే ఆంధ్రా కాంట్రాక్టర్ వచ్చి మొత్తం కూలిపోయేలా కట్టి పోయారని సోమయ్య ఆరోపించారు.కేసిఆర్ పైన వచ్చిన వ్యతిరేకత కారణంగా కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే రేవంత్ రెడ్డి వచ్చి తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలను మార్చేశారని తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ముక్కలు చెక్కలు చేశారని రానున్నరోజుల్లో మూసి సుందరీకరణ కోసం చేయనున్న పనులను ఆంధ్రా కాంట్రాక్టర్లకు ఇచ్చి ఆగం చేయదని గ్యారంటీ ఉందా? అని బత్తుల సోమయ్య ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. పక్కనే ఉన్న జార?ండ్ రాష్ట్రంలో పోరాడిన కుటుంబాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేశారని స్వరాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు కావస్తున్నా ఉద్యమకారుల కన్నీళ్లు తూడిచిన పాపాన పోలేదని సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల తల్లిదండ్రుల ఆక్రందన పాలకులకు వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. మేము మీ ఆస్థులేమన్నా అడుగుతున్నామా..? మా హక్కులే కదా అడిగేది అని బత్తుల అన్నారు. మీరు వృథా చేస్తున్న ప్రజాధనంతో పోల్చుకుంటే మాకు కేటాయించాల్సిన బడ్జెట్ ఎంత? అని అన్నారు. ఉద్యమ కారులంటే ఎంత చులకనగా చూస్తున్నారని గడ్డిపోచల్లా తీసిపారేయకండని గడ్డిపోచలన్నీ ఏకమైతే ఏం జరుగుతుందో చూపిస్తామని ఈ సందర్భంగా సోమయ్య హెచ్చరించారు. సామరస్యంగా సౌమ్యంగా అడుగు తున్నాం. ఇప్పటికైనా ఓ ప్రకటన చేయాలని ఇప్పటిదాకా సంయమనం పాటించామని తెలంగాణ ప్రజల ఓపిక నశిస్తే ఏమి జరిగిందో ఎలా తిరుగుబాటు చేశారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని బత్తుల సోమయ్య హితవుపలికారు.

## పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా
## సబ్బండ వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండ





**రామడుగు, జూలై 13( ప్రభాత సూర్య )**
పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా – సబ్బండ వర్గాలకు ప్రజా ప్రభుత్వ అండ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోనేరుపల్లెలో గ్రామ ఇంచార్జి ముద్దం తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు కాసు వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో మండలాన్ని అన్నిరకాల అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం సాంబయ్య పల్లె గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో చేపడుతున్న 10 లక్షల సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ కొత్తూరు మహేష్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ ఛైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, నాయకులు పెరుమాండ్ల గంగయ్య గౌడ్, కొట్టె అశోక్, వల్లాల కృష్ణహరి, మునిగాల సుధాకర్ గౌడ్, మావురపు రాములు, గుర్రం రమేష్ గౌడ్, కడారి శంకర్, అనుమల్ల సత్యం, పెద్ది రాజేందర్, బొడిగె తిరుపతి, కట్టెకోల లక్ష్మణ్, చుప్ప శ్రీనివాస్, కొత్తపల్లి నవీన్, పెరుక శ్రీనివాస్, కాల్వ అనిల్, ఉదారం వేణు, గజ్జెల అశోక్, లింగంపల్లి మల్లయ్య, కొత్తపల్లి కరుణాకర్, ఆవుల కనుకయ్య, జాడి రాజు , గొల్లె సంపత్, బండారి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణస్వీకార మహొత్సవం

**జ్యూడిషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వీరబాబు**




**జూలై 13 నల్గొండ ప్రభాత సూర్య**
నల్గొండ జిల్లా కేంద్రంలోని ఆదివారం పోలీస్ ఆడిటోరియంలో జ్యుడీషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా వీరబాబు ప్రమాణ స్వీకారం చేసి అనంతరం పాలకవర్గాన్ని ప్రమాణస్వీకారాన్ని చేపించారు తదానంతరం వీరబాబు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను ఎన్నుకున్నందుకు జ్యూడిషల్ ఎంప్లాయిస్ అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు భవిష్యత్తులో వారి సమస్యలపై నిరంతరం పరిష్కరిస్తూ అందుబాటులో ఉంటానని వారి సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు అదేవిధంగా ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో తమ విధి నిర్వహణ నిర్వహించాలని కోర్టు గౌరవాన్ని పెంపొదించే విధంగా పనిచేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లతీఫ్ భాష, సాగర్ రెడ్డి, వంశీకృష్ణ, రాంబాబు, జంగయ్య, ఉషారాణి, తిరుమలేశా, సుజాత,రామ్, గిరిధర్, ఉద్యోగస్తులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు

## నూతన కార్యవర్గం ఎన్నిక




**జూలై 13 నల్గొండ ప్రభాత సూర్య**
నల్గొండ జిల్లా కేంద్రంలోని గౌడ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం గోప జిల్లా అధ్యక్షుడిగా దుంతూరి సైదులు గౌడ్, ఉపాధ్యక్షులు లాల్ బహుదూర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నేలపట్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి పోలవరం వెంకటేశం నియమించారు ఈ కార్యక్రమంలో కాశయ్య గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు

# బికినీలో.. మన్మథుడు అన్ను అందాల విందు

'తాగితే కదా.. నచ్చుతుందో లేదో తెలిసేది... అంటూ మన్మథుడు సినిమాలో మృదు మధుర స్వరం, అమాయకత్వంతో ఆకట్టుకున్న అన్షు ఇప్పుడు మాత్రం సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో గ్లామర్ షోతో నెట్టింట రచ్చ చేస్తోంది. రెండు దశాబ్దాల క్రితం నాగార్జున మన్మథుడు సినిమాతో ఎంట్రీ ఇచ్చి చేసిన రెండు మూడు సినిమాలతోనే స్టార్ హీరోయిన్ స్టేటస్ తెచ్చుకున్న ఈ నటి ఆ చిత్రం తర్వాత ప్రభాస్‌తో రాఘవేంద్ర, తమిళంతో ప్రశాంతో ఓ సినిమా తెలుగులో గెస్ట్ పాత్రల్లో మాత్రమే నటించిన ఈ ముద్దుగుమ్మ ఆపై రీర్ ఊపందుకుంటున్న సమయంలోనే పెళ్లి చేసుకుని విదేశాలకు వెళ్లి పోయింది. ఇటీవల సందీప్ కిషన్, రావు రమేశ్ మజాకాతో తిరిగి సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చింది. కానీ మూవీ అంతగా విజయవంతం కాకపోవడంతో ఏవైనా ఛాన్సులు వస్తే వస్తా అన్నట్లు విదేశాలకు తిరిగి వెళ్లిపోయింది. అయితే పెళ్లై ఇద్దరు పిల్లలున్నా ఈ అమ్మడు సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్స్‌ను సంపాదించుకుంది. తాజాగా తన భర్త , పిల్లలతో కలిసి దుబాయ్ ట్రిప్‌కు వెళ్లిన ఈ భామ అక్కడ ఓ ఖరీదైన హొటల్‌లో బస చేసి, స్విమ్మింగ్ పూల్‌లో సేద తీరుతూ అందాలు ఆరబోస్తూ అభిమానులకు సడన్ షాక్ ఇచ్చింది. ఆ ఫొటోలు చూసిన వారంతా అన్షును ఇంత హాట్‌గా ఎన్నడూ చూడలేదంటు కామెంట్లు చేస్తున్నారు. సినిమాల్లోనూ ఎప్పుడూ అందాల ప్రదర్శణ చేయని ఈ బ్యూటీ ఇప్పుడేంటీ ఇంతగా గ్లామర్ ట్రీట్ ఇస్తుందంటూ అనుకుంటున్నారు.



# క్లీవేజ్ అందాలతో విష్ణు ప్రియ రచ్చ



# సెన్సార్ పూర్తి చేసుకున్న 'మై బేబీ' జూలై 18న గ్రాండ్ రిలీజ్

ఇటీవల తమిళంలో విడుదలై భారీ విజయం సాధించిన 'డి.ఎన్.ఎ' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ కొండేటి ఈ చిత్రాన్ని 'మై బేబి' పేరుతో ఈనెల జూలై 18న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మూవీ సెన్సార్‌ను పూర్తి చేసుకుంది. గతంలో 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్ మాల్', 'పిజ్జా' వంటి 15 విజయవంతమైన చిత్రాలను నిర్మాతగా అందించిన సురేష్ కొండేటి, డిస్ట్రిబ్యూటర్‌గా 85కు పైగా సినిమాలను విడుదల చేశారు. 'మై బేబి' ఆయన నిర్మాణంలో వస్తున్న 16వ చిత్రం. ఈ సినిమా కూడా భారీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధర్వ మురళి మరియు నిమిషా సజయన్ జంటగా నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వం వహించారు. 2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన ఒక దుర్ఘటన ఆధారంగా ఈ కథ రూపొందిందని చిత్ర బృందం తెలిపింది. గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో కూడిన భావోద్వేగభరితమైన కథాంశం ఈ సినిమా ప్రత్యేకత అని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఎస్.కె. పిక్చర్స్ ద్వారా విడుదల చేయనున్నారు. సాయి చరణ్ తేజ పుల్లా, దుప్పటి గట్టు సారిక రెడ్డి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా వ్యవహరించారు.






# బిగ్‌బాస్ షోలో ఛాన్స్ వస్తే వెళ్తారా? పీలింగ్స్ సింగర్ ఆన్సరిదే!

అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప 2 మూవీలో వస్తుండాయి పీలింగ్స్ పాట ఎంత సెన్సేషన్ అయిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ పాట కోసం సినిమా ఇండస్ట్రీలోని టాప్ సింగర్స్‌ను కాదని జానపద గాయని దాస లక్ష్మితో పాడించారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం గన్నోర గ్రామానికి చెందిన లక్ష్మి చిన్నప్పటినుంచే ఫోక్ సాంగ్స్ పాడుతుండేది. పలు పాటల ప్రోగ్రామ్స్‌లోనూ పాల్గొనేది. యూట్యూబ్ వల్ల లక్ష్మి చాలా పాపులర్ అయింది.

**పుష్ప 2లో ఛాన్స్**

తిన్నా తీరం పడుతలే.. కూసున్నా తీరం పడుతలే.., ఆనాడేమన్నంటినా తిరుపతి.. నిన్ను ఈనాడేమన్నంటినా తిరుపతి వంటి పాటలు ఆమెకు బోలెడంత పేరు తెచ్చిపెట్టాయి. ఇంకేముంది, దర్శకుడు సుకుమార్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్.. లక్ష్మి టాలెంట్ గురించి తెలుసుకుని వెంటనే పుష్ప 2లో ఛాన్స్ ఇచ్చారు. అలా ఆమె వస్తుండాయి పీలింగ్స్ పాట పాడింది. అంతకుముందు బ్యాచ్ మూవీలో ఓ పాట, దసరాలో ధూమ్ ధామ్ దోస్తాన్ సాంగ్ పాడింది.

**బిగ్‌బాస్ నుంచి ఆఫర్ వస్తే..**

బిగ్‌బాస్ షోలో ఛాన్స్ వస్తే వెళ్తారా? అన్న ప్రశ్నకు లక్ష్మి తాజాగా ఇలా స్పందించింది. బిగ్‌బాస్ షోకి వెళ్లాలన్న ఆలోచనే రాలేదు. ఎందుకంటే నా భర్త, ఏడాదిన్నర పిల్లాడే నా ప్రపంచం. వారిని విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్లలేను. బాబు ఇంకా చిన్నవాడు కాబట్టి దుబాయ్, మస్కట్ వంటి దేశాల్లో మూడు, నాలుగు రోజుల ప్రోగ్రామ్స్ ఉంటేనే వెళ్లలేకపోతున్నాను. నేను బిగ్‌బాస్ షో చూస్తూ ఉంటాను. ఒకవేళ ఛాన్స్ వస్తే వెళ్లడానికి ప్రయత్నిస్తాను అని లక్ష్మి చెప్పుకొచ్చింది.



# శ్రీకృష్ణ దేవరాయ బయోపిక్‌లో రిషబ్ శెట్టి?

కాంతార సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు రిషబ్‌శెట్టి ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్‌లను ఓకే చేస్తున్నాడు. ఇప్పటికే కాంతార ప్రీక్వెల్‌ను తెరకెక్కిస్తున్న రిషబ్ మరోవైపు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ పాత్రలో రాబోతున్న ఒక సినిమాలో నటించబోతున్నాడు. అయితే ఈ రెండు ప్రాజెక్ట్‌లే కాకుండా మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను రిషబ్ శెట్టి చేయబోతున్నట్లు తెలుస్తుంది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అశుతోష్ గోవారికర్‌తో కలిసి రిషబ్ ఒక భారీ చారిత్రక చిత్రంలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆంధ్ర భోజుడు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కబోతుంది. కాగా దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. "పానిపట్", "జోధా అక్బర్", "మొహెంజోదారో", "లగాన్" వంటి హిస్టారికల్ చిత్రాలను తెరకెక్కించిన అశుతోష్ గోవారికర్ శ్రీకృష్ణదేవరాయలు బయోపిక్ తీస్తున్నట్లు వార్తలు వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.